పని చేయవని తెలుస్తుంది. బంకం సూత్రం మీద పరిశోధన చేసి రైటర్స్ బంకం కథలూ, బంకం నవలలూ, సినిమా వారు బంకం సినిమాలు తీయవచ్చు.

(కలకత్తా ఆంధ్ర సంఘంవారి 1970 సూవెనీర్ లోని శ్రీషారు యస్. రంగ్నేకర్ వ్యాసం చదివి వ్రాసింది.)

# గృహడైనమిక్స్

పిల్లలు ఎదిగివచ్చేసరికి, ప్రతి స్త్రీకి వైవాహిక జీవితం మోయ లేని భారం కావటం సహజం. గృహిణికి ప్రతిరోజూ ఒక గడ్డు సమస్యగా తయారవుతుంది. ముదరగా ముదరగా "టెన్షన్", కుండ బ్రద్దలయినట్లు ఆవిడగారి మనసు ఏదో ఒకరోజు బ్రద్దలయి యేకాకిగా చికాకుగా వుండి చింతావారి అమ్మాయి అయిపోతుంది. ఏడ్చినా, కోసం తెచ్చుకొని అరచినా కోతిలా గంతులు వేసినా, అది తగ్గదుకాక తగ్గదు.

ఇది గృహ ప్రళయం అవొచ్చు. ప్రతి యింట్లోనూ ఏవో గొడవ లుంటాయి. చీకాకు లుంటాయి. మనశ్శాంతి కరువవుతుంది. ఈ పరిస్థితిని ఏమీ పట్టించుగోకుండా తిరిగే మగపురుషులుంటారు. ఇలాంటి ఇల్లాళ్ళ బాధలను కథలుగా వ్రాసి నాలుగు డబ్బులుచేసుకోవాలనే షార్టు స్టోరీ రైటర్సుంటారు. కాని ముళ్ళపొదలో గళ్ళచీరలా వున్న ఇల్లాలి జీవితంలోకి తొంగిచూసి నాలుగు మంచి మాటలు చెప్పి లాలించి, ఆవిడ సేద దీర్చే మంచివాళ్ళు చాలా తక్కువగా వుంటారు. పొరుగింటి మీనాక్షమ్మలు మన్నోకంట కనిపెడ్తూ నవ్వుకుంటూంటారు. తమదాకా వస్తే కాని వారికీ తెలీదు. ఎదటివారి జీవితంలోని లోట్లు మనకు కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి కాని గురవిందగింజ తన క్రింద నలుపు తెలుసుకోలేదు గదా!

మనం వుండే ఇళ్ళు ఎలాంటివి? మురికి గోడలు, ఇరుకు గదులు, చిన్న, చిన్న వాటాలు, కామను లెట్రిన్లూ, కామను బాత్రూంలూ వుమ్మడి పంపూ - మధ్య తరగతి గృహిణికి దాచుకుందామన్నా రహస్యాలు దాగవు. లోపల ఏడ్చినా బయటకు తెలుస్తుంది. ఇంట్లోఏం జరిగినా నాలుగువూళ్ళకు తెలిసిపోతుంది! గుట్టూ మట్టూ వుండేడిస్తేనా? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. కుటుంబ జీవితంలోని రోజువారీ అవక తవకలు ఎన్నని దాచుకుంటాం. తగాదాలూ, తంపులూ, కోపాలూ, తాపాలూ, వున్నాయనీ లేవనీ యిదే కదా యేడుపు? ఈ యేడుపు దాస్తే దాగుతుందా?

ఓ అరగంట క్రితం మీరూ మీవారూ ఛడా మడా రైటండ్ లెఫ్ట్ "త్వం శుంఠ అంటే త్వం శుంఠ" అని పోట్లాడేసుకున్నా రనుకోండి. మరుక్షణంలో అది రేడియో తరంగాలై వూరంతా

వ్యాపిస్తుంది. మీ పిల్లల గురించి మీకూ, మీ శ్రీవారికీ మాటా మాటా వచ్చిందనుకోండి మాట వరసకి ఆయన అలా ఆఫీసుకు దయచేయగానే మీరు డవున్లై పోతారు. అలాటి సమయంలో మీ యింటికో చుట్టం వచ్చాడనుకోండి. నవ్వు మీ మొహం మీదకు రమ్మన్నారాదు. ఆ చుట్టాన్ని పలకరిస్తుండగానే మిమ్మల్నోకంట కనిపెడుతున్న పొరుగింటి మీనాక్షమ్మ మేడమీద కనబడుతుంది, అప్పుడు మీ కెలాగుంటుంది? దాని మొహం బోర్లేసి యీడవాలనిపిస్తుంది. అదంతా మీరు మీ చుట్టం మీదగాని, అప్పుడే మీ గడప దగ్గర నిలబడ్డ పోస్టుమేన్‌మీదగాని, గోడమీద "ఇంట్లో అంతా బాగున్నారా" అని రాసుకుపోయే మలేరియా వాడిమీదగానీ చూపటం అధర్మం, అన్యాయం, అక్రమం, అవివేకం కూడాను. అప్పుడే మీరు గాజు గ్లాసుల్ని తన్నేస్తారు. తలుపులు బ్రద్దలు కొడతారు. బాత్రూంలో బాల్చీలను, గిన్నెలను టమటమ లాడిస్తారు.

ఇలాటివి ఎందుకు వస్తాయి? ప్రపంచం తలక్రిందులై పోయినట్లు ఎందుకు అనిపిస్తుంది? అసలు ఈ సృష్టి క్రమమే చాలా గందరగోళంగా వున్నట్లు మీకు ఎందుకు తోస్తుంది? అలాటప్పుడు మీరేం చేయాలి?

కుర్చీలు, బల్లలు, చెంబులూ బిందెలూ ఎక్కడివక్కడ సర్ది ఒక కుర్చీ లాక్కుని స్థిమితంగా కూర్చోవాలి. రాత్రయితే పెద్ద దీపాలన్నీతీసి ఒక చిన్న దీపం వేసుకుంటే చాలు. అంతకు ముందు మీతో పోట్లాడిన మీవారొచ్చి "హల్లో స్వీట్ బాగున్నావా" అని మీ భుజంమీద చేతులేసి మిమ్మల్ని బుజ్జగిస్తారు. ఒకోరోజు పోస్టులో మీ పిల్లల ప్రోగ్రెసు కార్డు లొస్తాయి. అందరికీ సున్నాలే. మీ చంటి పిల్లకు డోకులూ, విరోచనాలు. మీ చెల్లెలికి గాజులు తొడిగిస్తున్నారని మిమ్మల్ని రమ్మనమని మీ పుట్టింటినుంచి ఆహ్వానం వస్తుంది. ఉత్తరం రాసిపడేసి పది రూపాయలు మనియార్డరు చేయమని మీవారు హితోపదేశం చేస్తారు. మీరు కొట్లో అట్టేపెట్టమని చెప్పిన పట్టుచీర మీ ఎదురింటి యమునారాణి తన మొగుడుతో చెప్పి కొనేసి కట్టుకుని మీకు చూపించడాని కొస్తుంది. పనిమనిషి మీరిచ్చిన పాతచీర, చిల్లర డబ్బులూ, అన్నాలూ, కూరలూ ఆరగించి మీ యింటికి రాకుండా పక్క వాటా వారింట్లో కొత్త మంచాలకు నవారునేస్తూ నవ్వుతూ త్రుళ్ళుతూ కబుర్లు చెబుతూ వుంటుంది. మీరు కేకేసినా అది కేరేకాస్‌గా మీ కేసి చూడదు. మీ పెద్దపిల్లాడి జేబులో అగ్గిపెట్టె, సిగరెట్టు పీకలూ దొరుకుతాయి. మీవారి పంట్లాములో ఇంగ్లీషులో వ్రాసిన ఒక ఆడ ఉత్తరం దొరుకుతుంది. ఇంతలో పోస్టులో మీ అమ్మాయి పేరనో దుష్టుడు వ్రాసిన అసభ్య లేఖ వస్తుంది. గృహిణిగా మీరివన్నీ తట్టుకొని ఎలా నిలబడగలుగుతారు? మీరు పేడకుప్పలా కూలిపోకూడదు. ఇంతలో పాల బాటిల్సు పిల్లి తిరగదోస్తుంది. మంచి నూనె బుడ్డీ మూత తిరగదోసి అందులో పాతకలాటి ఎలక చచ్చిపడి వుంది. అప్పుడు మీకీ లోకమంతా మీ మీద పగబట్టి కుట్ర పన్నుతూ వున్నట్లు వుంటుందా, లేదా?

ఇలాంటప్పుడు మీరు గబ గబా వీధిలోకి వెళ్ళారనుకోండి. ఏ లాంతరు స్తంభాన్నో గుద్దేస్తారు. లేదా కారు కిందో, రిక్షా కిందో, పడతారు. ఏ సైకిలువాడో మీకు డాష్ యిస్తాడు.

వీటిని పరిశీలిస్తే మీకు వచ్చే కష్టాలు రెండు రకాలని తేల్తాయి. ఒకటి ఇంట్లోవి, ఒకటి బయట్నుంచొచ్చినవి. మీ ప్రమేయం లేకుండా వచ్చిన వాటి గురించి మీరు బాధపడటం మానెయ్యాలి. చాలా విషయాలను మీరు సర్దిపుచ్చుకోవాలి. మీ అంతట కోరి మీరు తెచ్చుకున్నవైతే మీరంత హీటెక్కి పోవడం తగదు. కొన్నిటిని మీరు వాయిదా వేయవచ్చు. పక్కింట్లో ఒడియాలు పెడుతున్నారుగదా అని మీరు ఒడియాలు పెట్టక్కర్లేదు వాయిదా వేయటం చాలా మంచిది.

మీరు హీటెక్కిపోయి అందరినీ హీటెక్కించేయడం మర్యాద కాదు. కోపం వున్నవారి లోంచి లేనివారికి తమ తమ చర్యల ద్వారా ప్రసారం కావచ్చు, ఇది గృహ డైనమిక్సు, అందుచేత మీరు మరో సూత్రాన్ని అవలంబించాలి. మీరు అలిగి కోపం తెచ్చుకున్నప్పుడు దాని ప్రభావం చెడు ఫలితాలను కలిగించకుండా వుండాలంటే ఆ హీట్‌ని మీరు యిటూ అటూ నెట్టెయ్యాలి. అంతేగాని మరోమాటు దొడ్డికెళ్ళిందని చంటి పిల్లను ఎత్తి కుదేసి గోడకేసి కొట్టకూడదు. బాత్రూంలో చంటి పిల్లలను ఒంటిరెక్కతో యీడుస్తూ నేలకేసి బాదే కన్నతల్లుల్ని నేను చూశాను. నిజమే మీకు ఓపికలేదు. చాకిరీ ఎక్కువ. ఒక కప్పు కాఫీ త్రాగండి, (మొగవాళ్లయితే ఒక సిగరెట్టు వూదేస్తారు) ఒక నవలో, పత్రికో కాసేపు చూడండి. రేడియోలో ఒక మంచి కీర్తన యేదైనావస్తే వినండి. కోప కారణాలు నశించినా మీలో కోపం ఇంకా అలానే వుండిపోతుంది. ఎంచేతంటే యింట్లో ఎవరూ లేకపోతే మీ చిరాకంతా యెవరిమీద చూపిస్తారు. వేడ్నీళ్ళలో చన్నీళ్లు కలిపితే సమపాళాలవుతాయి. అంటే అంతకు ముందు చల్లగా వున్న నీరు వెడెక్కుతుంది. తొలుపుకోడానికి చన్నీళ్లు లేకపోతే యేమవుతుంది? సలసలా మరిగిన నీళ్లు చల్లారటానికి చాలాకాలం పడుతుంది.

అంచేత దంపతులైతే వారికి ఏకాంతం చాలా ముఖ్యం. ఉమ్మడి కుటుంబాల్లో దంపతులు పగలు విచిత్ర దంపతుల్లా ఎడమొహం, పెడమొహంగా వుంటారు.

"నీకోసమే నే జీవించునదీ" అని పాడుకోవటానికి ఛాన్సుండదు. కుటుంబ జీవితంలో దంపతులకు ఏకాంతం లేకపోయినట్లయితే వారి సంసారిక "జీవితం సలసల కాగే చమురా కాదిది" అన్నట్లుంటుంది. మీరు కోపంగా వున్నప్పుడు సాధ్యమైనంతవరకూ పరాయి వారితో మాట్లాడకండి. ఎంచేతంటే మీరేం మాట్లాడుతారో మీకు తెలీదు గనుక.

## శ్రీమతి పార్కిన్సన్స్‌లా (స్త్రీల కోపతాపోపశమన సిద్ధాంతము)

పట్టపగలు రొమాన్స్‌కి లవ్ మేకింగ్‌కి స్కోప్ వుండనంత మాత్రాన జాయింట్ ఫామిలీస్‌ని బొత్తిగా యూజ్‌లెస్ అని తిట్టడానికి వీల్లేదు. జాయింటు ఫామిలీస్‌లో ప్రతిఒక్కటికి ఎంతో కొంత మినిమం దక్షిణ వుంటుంది. అక్కడ సోమరితనం జాంతానై. ఏడిస్తే ఎందుకేడుస్తున్నావని అడిగేవారుంటారు. నవ్వితే మనతోబాటు నవ్వే వారుంటారు. ఈ లింగూ లిటుకూ ఏక్ థా